క్లుప్తంగా

స్కీం వర్కర్ల నిరసనలు జయప్రదం చేయాలి


ఆశావర్కర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఐలాపురం రాజశేఖర్

బాలానగర్: స్కీం వర్కర్ల దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ కోరారు. గురువారం బాలానగర్‌లో ఆశావర్కర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 6వ తేదీన (శుక్రవారం) 72 స్కీం వర్కర్లు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతారని పేర్కొన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

8న సంక్రాంతి ముగ్గుల పోటీలు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జన్మభూమి కాలనీ బస్‌స్టాప్‌లో ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎల్లమ్మబండ పరిసర ప్రాంత మహిళలు ఈ పోటీలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లు హాజరవుతారని తెలిపారు. విజేతలకు నగదు బహుమతి ఉంటుదని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే వారు ముగ్గు, రంగులు తెచ్చుకోవాలని కోరారు.

చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు సుందరీకరణ పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పనుల్లో జాప్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయితే హైదరాబాద్ మహానగరంలో మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకోనుందని ఎమ్మెల్యే అన్నారు. చెరువు పరిసరాల్లో చెట్లు, పూలవనంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఇన్‌స్పెక్టర్‌నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఓటర్ తుది జాబితా విడుదల


నోటీస్ బోర్డులో తుది జాబితా ప్రతిని ప్రదర్శిస్తున్న డీసీ రవికుమార్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఓటర్ తుది జాబితాను గురువారం అధికారులు విడుదల చేశారు. దీనికి సంబంధించిన ప్రతిని సర్కిల్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో డీసీ రవికుమార్ అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో పురుషులు 224070, మహిళలు 202276, ట్రాన్స్‌జెండర్స్ 119 మంది ఉన్నట్లు తెలిపారు.


బీజేవైఎం నాయకుల అరెస్టు


సౌత్‌లాలాగూడ పీఎస్‌లో నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: నిరుద్యోగుల జీవితాలను నాశనం చేసే నిర్ణయాలతో లక్షలాది మంది పోలీసు అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీజేవైఎం నాయకులు ప్రగతి భవన్ ముట్టడికి గురువారం బయల్దేరారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ పాటు రాష్ట్ర కార్యవర్గసభ్యులు కన్నె ప్రకాశ్, అదిత్య, దినేష్, సందీప్, నరేష్, మహేష ప్రమోద్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని సౌత్ లాలాగూడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రన్నింగ్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులందరికి మెయిన్ ఎగ్జామ్స్‌కు అవకాశం కల్పించాలన్నారు. హైకోర్టు ఉత్తర్వులను వెంటనే పాటించాలని డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న నాయకులను సొంత పూచికత్తుపై సాయంత్రం వదిలివేశారు.

పండక్కి ఊరెళ్తున్నారా..?
అయితే ఇల్లు జాగ్రత్త!

సంక్రాంతి పండుగ వస్తుందంటే నగరవాసులు కుటుంబ సమేతంగా పల్లె'టూర్' బాట పట్టేస్తారు. పండుగ ఆనందాలను తనివితీరా ఆస్వాదించేందుకు కోటి ఆశలతో స్వస్థలాలకు వెళ్తుంటారు. అయితే ఇదే అదునుగా దొంగలు విజృంభించేందుకు తమ ప్రణాళికలను రూపొందించుకుంటారన్న విషయాన్ని గుర్తెరగాల్సిన అవసరం ఉందని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు చెబుతున్నారు.



భాగ్యనగర్‌కాలనీ: విద్యా సంస్థలకు సోమవారం నుంచి సెలవులు ప్రకటించనుండటంతో నగరవాసులు స్వస్థలాలకు పయనమవటానికి సిద్ధమవనున్నారు. సుమారు వారం రోజుల పాటు సెలవులు రానుండటంతో ఆయా రోజుల్లో పల్లెల్లో గడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకొని తరలి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇదే అదునుగా దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించే అవకాశాలు లేకపోలేదు. ఈ దిశగా పోలీసులు పలు సూచనలు, జాగ్రత్తలతో కూడిన కర పత్రాల్లో ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. సొంత ప్రాంతాలకు వెళ్లే ఆయా కాలనీ, బస్తీ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

బంగారు ఆభరణాలు లాకర్లలో భద్రపరుచుకోవాలి..

◆ గతంలో జరిగిన దొంగతనాలను పరిగణనలోకి తీసుకొని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలుపుతున్నారు. సొంత ప్రాంతాలకు వెళ్లే వారు బంగారు ఆభరణాలు లాకర్లలో గానీ తెలిసిన వారి ఇళ్ల వద్ద గానీ భద్ర పర్చుకోవాలని సూచిస్తున్నారు. ప్రధానంగా ఊరుకు వెళ్తున్న విషయాన్ని ప్రచారం చేసుకోకుండా తమ ఇంటికి తాళం వేసినా పక్క వారికి సమాచారం అందించి వెళ్లాలని తెలుపుతున్నారు. ముఖ్యంగా బస్సుల్లో ప్రయాణించే వారు విలువైన వస్తువులు వెంట తీసుకువెళ్తున్నప్పుడు ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తు గమ్యానికి చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి..

◆ ఇదే విధంగా బస్సులు ఎక్కే, దిగే సమయంలో దొంగలు చేతి వాటం ప్రదర్శించే అవకాశం ఉంది. చుట్టు పక్కల వారిని గమనిస్తూ ప్రయాణాన్ని కొనసాగించాలి. అదే విధంగా ఇంటి నుంచి ఊరికి వెళ్లే ముందు ఇంటి కిటికీలు, తాళాలు సరిగ్గా వేశామా లేదా అని జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవటం మంచిది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న వారు ఫోన్ లింక్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలి. పోలీసులు సైతం రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు చేపట్టనున్నారు.

దొంగతనాలు అరికట్టేందుకు ప్రచారం..



నగరంలో స్థిరపడ్డ వారు ఊరికి వెళ్లే ముందు ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలి. లేదంటే బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలి. బస్సుల్లో ప్రయాణించే వారు రద్దీని దృష్టిలో పెట్టుకొని విలువైన వస్తువులను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పరిశీలించుకొని వెళ్లాలి. దొంగతనాలు అరికట్టేందుకు ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నాం. అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు కెమెరా లింక్ ద్వారా మీ సెల్‌ఫోన్‌లో కనిపిస్తే వెంటనే 100కి సమాచారం అందించాలి.

– కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్, నర్సింగ్‌రావు

కొత్త డీజీపీ అంజనీకుమార్‌కు శుభాకాంక్షలు


డీజీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన అంజనీకుమార్‌ను గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, సబిహాబేగం, పగుడాల శిరీష, మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, మహేశ్వరి శ్రీహరి, దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గాజీ ఫహీముద్దీన్‌కు డాక్టరేట్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అనువాద అధ్యయనాల విభాగంలో పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని గురువారం ప్రకటించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థి ఎం.డి.గాజీ ఫహీముద్దీన్ అనువాద అధ్యయనాల విభాగం ప్రొఫెసర్ ఖలీద్ ముబాషిర్ ఉజ్ జాఫర్ పర్యవేక్షణలో 'ఉర్దూ మే షోబా ఈ తాలిమ్ ఓ తర్బియాత్ సే ముతాలిక్ తర్జుమా కర్దా కితాబోన్ కా తౌజీహి ఇషారియా' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. దీంతో ఆయనను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి ఫెలోషిప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన డాక్టోరల్ విద్యార్థిని చినార్ మెహతాకు ఫుల్‌బ్రైట్-నెహ్రూ డాక్టోరల్ ఫెలోషిప్ లభించింది. హెచ్‌సీయూలోని కమ్యూనికేషన్ విభాగంలో ప్రొఫెసర్ ఉషారామన్ పర్యవేక్షణలో చినార్ మెహతా 2022–23 కాలానికి ఫుల్‌బ్రైట్ నెహ్రూ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నారు. జనవరి నుంచి ఆమె తదుపరి 9 నెలలు అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లోని కార్నెగీ మెల్లన్ విశ్వవిద్యాలయం హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్ ఇన్‌స్టిట్యూట్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టర్ సారా ఫాక్స్ ద్వారా మార్గదర్శకత్వం వహిస్తుంది.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నేరం

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం రుద్రారం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణంలో టైర్స్ కార్మికులకు ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులు, ప్రచారంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్టవిరుద్ధమని, విద్యాలయాల వద్ద 100 మీటర్ల వరకు పొగాకు సేవించడం, ఉత్పత్తుల అమ్మకం నిషేధమన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతో పాటు రెండేళ్ల జైలుశిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు వస్తువులు అమ్మరాదన్నారు. ప్రజలకు మైక్ సెట్, ఐసీయూ, బ్యానర్లను ఉపయోగించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాములు, కార్మికులు తదితరులు పాల్గున్నారు.

ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి పదవి బాధ్యతలు చెపట్టిన వేణుగోపాలాచారిని దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మినిష్టర్ క్వార్టర్స్‌లో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో తన అనుచరులు, నాయకులతో వేణుగోపాలాచారిని కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ముప్పిడి నవీన్ మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న నేతకు చైర్మన్ పదవి దక్కడం సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్ర సాయి, బి. హరి, అకాష్, కలీమ్, రామేష్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు చోరీ



భాగ్యనగర్‌కాలనీ: ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరారైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట హబీబ్‌నగర్‌లో నివాసముంటున్న రామపత్రిని జయలక్ష్మి(40) కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో పని చేస్తోంది. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటి దగ్గరలో నడుచుకుంటూ వెళ్తుండగా వసుంధరా ఆసుపత్రి రోడ్డులో మాస్క్ ధరించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి 2.50 తులాల మంగళసూత్రాన్ని లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బూర నర్సయ్యకు శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి నియోజవకవర్గ పాలక్‌గా నియమితులైన బూర నర్సయ్యగౌడ్‌కు ఉప్పల విద్యాకల్పన గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు గణేష్‌గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా సెక్రటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

– ఆల్విన్‌కాలనీ

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య బృందంతో డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్‌రావు తదితరులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ స్టడీస్, ఎస్కీ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో చాణక్య సెమినార్ హాల్‌లో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, మ్యాక్స్‌విజన్ వారి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు విద్యార్థులు ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే చదువును సులభంగా అర్థం చేసుకొని, మరింతగా చదువుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం రెడ్డీస్ లేబరేటరీ, మ్యాక్స్‌విజన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉచితంగా రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఎస్కీ బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎస్ కృష్ణప్రసాద్‌రావు, ఇతర అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, రెడ్డీస్ లేబరేటరీ, మ్యాక్స్‌విజన్ వైద్యబృందం పాల్గొన్నారు.

'మనూ'లో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

రాయదుర్గం: మనూలో సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం ఉచిత కోచింగ్ అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్‌ఈ ఆర్‌సీఏ ఇన్‌చార్జి ప్రొ.అలీమ్ బాషా గురువారం తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ(సీఎస్‌ఈ–ఆర్‌సీఏ) యూపీఎస్‌సీ ద్వారా మే 2023లో నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందిస్తోందన్నారు. ఇందులో పాల్గొనే వారు జనవరి 10 లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఉర్దూ యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను యూనివర్సిటీ క్యాంపస్‌లోని సీఎస్‌ఈ రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీకి పోస్టు ద్వారా పంపవచ్చన్నారు.

హెచ్‌సీయూలో ఎన్‌సీఏఈఆర్ సదస్సు

రాయదుర్గం: అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు బలమైన ఆర్థిక ఫ్రేమ్ వర్క్ కలిగి ఉన్నాయని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్(ఎన్‌సీఏఈఆర్) డైరెక్టర్ జనరల్, పీఎం–ఈఏసీ సభ్యుడు డాక్టర్ పూనమ్‌గుప్తా పేర్కొన్నారు. హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, ది ఇండియన్ ఎకనమెట్రిక్ సొసైటీతో కలిసి నిర్వహిస్తున్న సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, భారతదేశం కోసం మెరుగైన ప్రపంచ ఆర్థిక భద్రత వలయాలను నిర్మించడం' అనే అంశంపై డాక్టర్ పూనమ్ గుప్తా మాట్లాడారు.

నాలా విస్తరణ పనులను వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: నాలా విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీ వద్ద చేపట్టిన నాలా విస్తరణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాబోయే వర్షకాలంలోపు పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాలా విస్తరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టడంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం వహించకుండా నాణ్యతాప్రమాణాలు చేపట్టి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈఈ శ్రీకాంతిని, డీఈ ప్రవీణ్, ఏఈ శివప్రసాద్, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు నరేందర్, సందీప్‌రెడ్డి, సీతారామయ్య, చంద్రశేఖర్, రామారావు పాల్గొన్నారు.

మొట్టమొదటి హరి చిహ్న ధ్వజం ఆవిష్కరణ


ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి హరి చిహ్నంతో వెలసిన ధ్వజాన్ని ఎన్టీఆర్‌నగర్‌లోని జగద్గురు శ్రీసంత్ గురు రవిదాస్ ఆలయం వద్ద ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి జెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ ధ్వజాన్ని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కాశీనాథ్‌యాదవ్, మోచీ సంఘం హైదరాబాద్ చైర్మన్ రవిదాస్ వాగ్మారే, హమీలపూర్ దశరథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ఉపకుల సంఘ అధ్యక్షుడు మల్లన్న, డాక్టర్ కిషోర్ వార్కిడే, ఎల్లమ్మబండ మోచీ సంఘం అధ్యక్షుడు హమీల్పూర్ గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ వెంకటపాపయ్యనగర్ కమ్యూనిటీహాల్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సరం కేలండర్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాండుగౌడ్, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌యాదవ్, యాదగిరి, కాలనీ అధ్యక్షుడు రాందాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు దేవేందర్, జనరల్ సెక్రటరీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కూల్ ఎవరెస్ట్ కేలండర్...

కూకట్‌పల్లి: కూల్ ఎవరెస్ట్ అధినేత వెంకటరెడ్డి యక్కంటి గురువారం కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కూల్ ఎవరెస్ట్ వారి నూతన కేలండర్‌ను ఇన్‌స్పెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2022–23 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసినట్లు డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి గురువారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో పాటు వివిధ పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగాల పదోన్నతులకు, యూనివర్సిటీ ఉన్నత విద్యకు దూరవిద్య కోర్సుల డిగ్రీ సర్టిఫికెట్లు రెగ్యులర్ కోర్సుల మాదిరి ఉపయోగపడుతాయన్నారు.

మరో మహాప్రస్థానంలా ఆల్విన్‌కాలనీ శ్మశానవాటిక


ఎల్లమ్మబండలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- సకల నదుపాయాలతో సుందరవనంగా తీర్చిదిద్దుతాం
- ఆహ్లాద వాతావరణం ఉట్టిపడేలా శ్మశానవాటిక పనులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో రూ.4.5కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలలో జరుగుతున్న సుందరీకరణ, అభివృద్ధి నిర్మాణ పనులను గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. అదే విధంగా ఎల్లమ్మబండ నుంచి గాజులరామారం వరకు చేపడుతున్న వంద ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి పరిశీలించి సూచనలు చేశారు.

◆ అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. అందులో భాగంగానే హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

◆ శ్మశానవాటికను సకల సదుపాయాలతో సుందరవనంగా మరో మహా ప్రస్థానంలాగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ శ్మశానవాటికలో అంత్యక్రియల ప్లాట్ ఫారం, అడ్మినిస్ట్రేషన్ భవనం, అంతర్గత రోడ్లు, టాయిలెట్లు, వాటర్ ఫౌంటేన్, స్నానాల గదులు, మనిషి చరిత్ర తెలిపే జీవిత చక్రం చిత్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

◆ అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. అదే విధంగా వంద ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సుభాష్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవి, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్ రెడ్డి, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, మాజీ అధ్యక్షుడు పాండుగౌడ్, ఉపాధ్యక్షుడు కాశినాథ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.